# పైలా

"శ్యామలా"

పైలాగ్లొబోసా (నత్త) డైజస్టివ్ సిస్టమ్ బొమ్మ రికార్డు షీటు మీద వేస్తున్న శ్యామల చేస్తున్న పని ఆపి తలుపు వైపు చూసింది.

"వార్డన్ నిన్ను పిలుస్తున్నారు" అంది జ్యోత్స్న.

"ఎందుకు?" లేచి నిలబడింది శ్యామల.

"నాకు తెలియదు. వెళ్ళి అడుగు" అని జ్యోత్స్న వెళ్ళిపోయింది.

రికార్డు షీటుమీద పెన్సిలు పెట్టి కిటికీ లోంచి వీచే గాలికి అది ఎగిరిపోకుండా జువాలజీ పుస్తకం దాని మీద పెట్టి హాస్టలు వార్డన్ గదివైపు నడుస్తూ తననెందుకు పిలచి ఉంటుందా అని ఆలోచిస్తూ వార్డన్ గది చేరుకుని, "మేడమ్, నన్ను పిలిచారా?" అడిగింది శ్యామల.

"నీకు ఫోను" రిసీవరు శ్యామల చేతికిచ్చి గది బయటకు వెళ్ళిపోయింది వార్డన్.

"హలో" అంది చిన్నగా. ఫోనులో ఎవరితో నయినా మాట్లాడాలంటే భయం. ఇంట్లో వాళ్లు నెలకొకసారికాని ఫోను చేయరు.

"ఎవరు మాట్లాడుతున్నారు?"

గొంతును గుర్తుపట్టలేకపోయింది. "శ్యామలను" అంది.

"నేను ప్రసన్నను."

శ్యామల గుండె వేగంగా కొట్టుకోవటం మొదలెట్టింది.

"ప్రసన్నా" అని చుట్టూ చూసింది. గదిలో ఎవరూ లేరు. వార్డన్ వరాండాలో ఎవరితోనో మాట్లాడుతోంది.

"నిన్న నిన్ను పిలుస్తున్నా పలకకుండా వెళ్లిపోయావేమిటి? అడిగాడు.

ఏమని జవాబు చెప్పాలో అర్థం కాలేదు.

"ఇహ నాతో మాట్లాడకూడ దనుకుంటున్నావా?" బాధగా అడిగాడు.

"లేదు. లేదు." అంది పైకి.

"నమ్మవచ్చా?"

"నీ ఇష్టం."

"ఈ సాయంత్రం వీలుచూసుకుని టాంక్‌బండ్ రాగలవా? అదే, ఎప్పుడూ మనం కలుసుకునే చోటు. నీతో ఒక విషయం చెప్పాలి."

"వీలుకాదు. ప్రసన్నా ఒక్క మాట విను. ఇహమీదట దయచేసి నాకు ఉత్తరాలు రాయకు. రాసినా నీకు జవాబు రాదు. ఫోను కూడా చేయొద్దు."

"ఒక్క మాట. ఫోను పెట్టెయ్యకు. ఈ ప్రశ్నకు జవాబు చెప్పు. నేనేమయినా తప్పు చేశానా?"

"లేదు. చేయలేదు."

"అమర్యాదగా ప్రవర్తించానా?"

"లేదు."

"నువ్వు చాలా మారిపోయావు. ఒక్కసారి, కనీసం ఒక్కసారి బయట నీతో మాట్లాడే...." ప్రసన్న మాట్లాడుతున్నాడు. శ్యామల ఫోను పెట్టేసింది. గుండె వేగంగా కొట్టుకునే చప్పుడు స్పష్టంగా వినిపిస్తోంది. రెండు చేతులతో ముఖం కప్పుకుని భోరున ఏడుద్దామనిపించింది. రెండు క్షణాలపాటు చేతిని ఫోనుమీదే ఉంచింది. చేయి చిన్నగా వణుకుతున్నట్లనిపించసాగింది. మెల్లగా గది బయటకు వచ్చి వార్డన్‌కు 'థేంక్స్' చెప్పి తన గదిలోకి వచ్చి కుర్చీలో కూలబడి రెండు చేతులతో తల పట్టుకుని కొద్దిసేపు కూర్చుని తలఅడ్డంగా ఆడించి 'అవును. నేను మారిపోయాను' అనుకుంది. ఈ మాటే పెద్దగా అరుస్తూ అందరికీ వినబడేలా చెబుదామనుకుంది. కళ్లల్లో నీళ్లు తిరుగుతోంటే గొంతు పూడుకుపోయింది.

నాలుగు రోజుల తర్వాత శ్యామలకు ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం ఎవరు రాసారో తనకు తెలుసు. కవరు చించి ఉత్తరం తీసి చదవాలా వద్దా అని చాలా సేపు ఆలోచించి చివరకు కవరు చించి ఉత్తరం బయటకు తీసింది. మొదటి ఉత్తరంతో పాటు చాల ఉత్తరాలున్నాయి. అవన్నీ తను అతనికి రాసినవి. "నన్ను చూడటం మీకు పాపమయితే, నాతో మాట్లాడటం మీకు అసహ్యమయితే మీ దారిలోకి ఎప్పుడూ రాను. మీ ఉత్తరాలన్నీ తిరిగి పంపించేస్తున్నాను. చించేయండి. మీ జీవితంలో తిరిగి ఎప్పుడయినా ఎక్కడయినా తటస్థపడితే నేను పలకరించినా పలకకండి. మీతో మాట్లాడితే నా హృదయం బద్దలై

మీ కాళ్ల మీద పడుతుంది. ఆ పగలిగిన ముక్కలు ఏరుకుంటూ పసిపిల్లాడిలా ఏడుస్తానేమో. అంత శిక్ష నాకు వద్దు. తెలిసో తెలియకో మీ ఎడల ఏదయినా పొరపాటో, తప్పో చేసి ఉంటే నన్ను క్షమించండి."

కింద పేరు లేదు. సంతకం లేదు. ఎంతో బాధతో రాసినట్లు పెన్ను పాళీ చిట్లిపోయిన గుర్తులున్నాయి. శ్యామల ఆ ఉత్తరాన్ని వందసార్లకు పైగా చదివి ఉంటుంది.

నాలుగు సంవత్సరాల తర్వాత –

హైదరాబాద్ నుండి విజయవాడ వెళ్లే నైట్ బస్సు జగ్గయ్య పేటలో ఆగింది. బస్సు ఆగిన కుదుపుకు శ్యామలకు మెలకువ వచ్చింది. పక్కసీట్లో పాప నిద్రపోతోంది. ముందు సీట్లో కూర్చున్న భర్త కిటికీలోంచి బయటకు చూస్తూ సిగరెట్ కాలుస్తున్నాడు.

"టైం ఎంతయిందండి?" అడిగింది శ్యామల భర్తను.

చెప్పి, "టీ తెస్తాను. తాగుతావా?" అడిగాడు.

"వద్దు" అంది.

పావుగంట తర్వాత బస్సు కదిలింది. వేగం పుంజుకున్నాక చల్లటిగాలి బస్సులోకి రావటం మొదలెట్టింది. శ్యామలకు నిద్ర పట్టసాగింది. చేతిలో ఉన్న పుస్తకం, రుమాలు జారి సీటు కింద పడేసరికి కళ్లు తెరిచి వంగి అందుకుంటోంటే చేతికి ఎవరిదో పెన్ను దొరికింది. అందుకుని చూసింది. నల్లటి పెన్ను మీద 'శ్యామల' అని బంగారు రంగులో చెక్కబడి ఉంది. శ్యామల చేతులు వణక సాగాయి. వెనకకు తిరిగి చూసింది. వెనక సీటు ఖాళీగా ఉంది. విజయవాడ వెళ్లాల్సిన మనిషి, ఎక్కడో దిగిపోయాడు. తిరిగి పెన్ను వంక చూసి మూత తీసింది. పాళీ చిట్లిపోయి ఉంది.

◆ కృష్ణాపత్రిక, 20 మే 1967